21-08-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీరు చైతన్యమైన లైట్ హౌస్ లు, మీరు అందరికీ తండ్రి పరిచయాన్ని ఇవ్వాలి, ఇంటి దారిని తెలియజేయాలి"

ప్రశ్న:- మున్ముందు ఏ డైరెక్షన్ మరియు అది ఏ విధి ద్వారా అనేక ఆత్మలకు లభించనున్నది?

జవాబు:- మున్ముందు అనేకులకు ఏ డైరెక్షన్ లభించనున్నదంటే - మీరు బ్రహ్మాకుమార-కుమారీల వద్దకు వెళ్ళండి, వారు మీకు వైకుంఠ యువరాజులుగా అయ్యే జ్ఞానాన్ని ఇస్తారు. ఈ డైరెక్షన్ వారికి బ్రహ్మా సాక్షాత్కారము ద్వారా లభిస్తుంది. చాలా వరకు బ్రహ్మా మరియు శ్రీకృష్ణుని సాక్షాత్కారమే జరుగుతుంది. ఏ విధముగా ఆదిలో సాక్షాత్కారపు పాత్ర నడిచిందో, అలాగే అంతిమంలో కూడా జరగనున్నది.

ఓం శాంతి. ఆత్మిక తండ్రి ఆత్మిక పిల్లలను అడుగుతారు, అందరినీ అయితే అడగలేరు. నళిని బిడ్డను అడుగుతున్నారు - ఇక్కడ ఏమి చేస్తున్నావు? ఎవరి స్మృతిలో కూర్చున్నావు? తండ్రి స్మృతిలో. కేవలం తండ్రి స్మృతిలోనే కూర్చున్నావా లేక ఇంకేవైనా కూడా గుర్తు వస్తున్నాయా? తండ్రి స్మృతి ద్వారానైతే వికర్మలు వినాశనమవుతాయి, ఇంకేమి స్మృతి చేస్తున్నావు? ఇది బుద్ధి పని కదా. ఆత్మలమైన మనము ఇప్పుడు ఇక ఇంటికి వెళ్ళాలి కావున ఇంటిని కూడా స్మృతి చేయాలి. అచ్చా, ఇంకేమి చేయాలి? ఇంట్లోకి వెళ్ళి కూర్చుండిపోవాలా! విష్ణువుకు స్వదర్శన చక్రాన్ని చూపిస్తారు కదా. దాని అర్థాన్ని కూడా తండ్రి ఇప్పుడు వివరించారు. స్వ అనగా ఆత్మకు 84 జన్మల చక్రము యొక్క దర్శనం జరిగింది. కావున ఆ చక్రాన్ని కూడా తిప్పవలసి ఉంటుంది. మీకు తెలుసు, మనం 84 జన్మల చక్రములో తిరిగి ఇంటికి వెళ్తాము, మళ్ళీ అక్కడి నుండి సత్యయుగములోకి వస్తాము, పాత్రను అభినయించడానికి. మళ్ళీ 84 జన్మల చక్రములో తిరుగుతాము. విష్ణువుకు చక్రమేమీ ఉండదు. వారు సత్యయుగ దేవత. విష్ణుపురి అని అనండి లేక లక్ష్మీ-నారాయణపురి అని అనండి లేక స్వర్గము అని అనండి. స్వర్గములో లక్ష్మీ-నారాయణుల రాజ్యం ఉండేది. రాధ-కృష్ణుల రాజ్యం అంటే అది పొరపాటు చేసినట్లు. రాధ-కృష్ణుల రాజ్యమైతే ఉండదు ఎందుకంటే వారు ఇరువురూ వేర్వేరు రాజ్యాలకు చెందిన యువరాజు, యువరాణి. రాజ్యానికి యజమానులుగానైతే స్వయంవరం తర్వాతనే అవుతారు. కావున విష్ణువుకు ఏదైతే చక్రాన్ని ఇచ్చారో, వాస్తవానికి ఆ చక్రం మీదే. కావున ఇక్కడ ఎప్పుడైతే కూర్చుంటారో, అప్పుడు కేవలం శాంతిలో కూర్చోవడమే కాదు, వారసత్వాన్ని కూడా స్మృతి చేయాలి. అందుకోసమే ఈ చక్రము ఉంది. తండ్రి అంటారు, మీరు లైట్ హౌస్ లు కూడా, మాట్లాడుతూ, తిరుగుతూ ఉన్న లైట్ హౌస్ లు. ఒక కంటిలో శాంతిధామము ఉంది, ఒక కంటిలో సుఖధామము ఉంది. రెండింటినీ స్మృతి చేయవలసి ఉంటుంది. స్మృతి ద్వారానైతే పాపాలు అంతమవ్వనున్నాయి. ఇంటిని స్మృతి చేయడం ద్వారా ఇంటికి వెళ్ళిపోతారు, మళ్ళీ చక్రాన్ని కూడా స్మృతి చేయాలి. ఈ మొత్తం చక్రమంతటి జ్ఞానం కేవలం మీకే ఉంది. మీరు 84 జన్మల చక్రాన్ని తిరిగి వచ్చారు. ఇప్పుడు ఈ మృత్యులోకములో ఇది అంతిమ జన్మ. కొత్త ప్రపంచాన్ని అమరలోకము అని అంటారు. అమరులు అనగా మీరు సదా జీవిస్తూనే ఉంటారు. మీరు ఎప్పుడూ మరణించరు. ఇక్కడైతే కూర్చుంటూ, కూర్చుంటూ అకస్మాత్తుగా మృత్యువు సంభవిస్తుంది. రోగాలు వస్తాయి. అక్కడ మరణిస్తామనే భయం ఉండదు ఎందుకంటే అది అమరలోకము. మీరు వృద్ధులుగా అయినా కానీ మేము వెళ్ళి గర్భమహలులోకి ప్రవేశిస్తాము అన్న జ్ఞానం ఉంటుంది. ఇప్పుడు గర్భజైలులోకి వెళ్తారు. అక్కడైతే గర్భమహలు ఉంటుంది. అక్కడ శిక్షలు అనుభవించాల్సి వచ్చేందుకు పాపాలు అనేవి జరగవు. ఇక్కడైతే పాపాలు చేస్తారు, ఆ కారణముగా శిక్షలు అనుభవించి గర్భం నుండి బయటకు వస్తారు, మళ్ళీ పాపాలు చేయడం మొదలుపెడతారు. ఇది పాపాత్ముల ప్రపంచము. ఇక్కడైతే కేవలం దుఃఖమే ఉంటుంది. అక్కడ దుఃఖము అన్న మాటే ఉండదు. కావున ఒక కంటిలో శాంతిధామాన్ని, ఇంకొక కంటిలో సుఖధామాన్ని పెట్టుకోండి. మీరు జన్మజన్మాంతరాలు జపతపాదులు మొదలైనవి చేస్తూ వచ్చినా కానీ ఆ జ్ఞానమైతే లేదు కదా. అది భక్తి. అందులో - మీరు ఈ విధంగా సతోప్రధానముగా అవ్వగలరు అన్న యుక్తి కూడా ఏమీ లభించదు. అది ఎవరికీ తెలియదు. కేవలం శ్రీకృష్ణ భగవానువాచ - దేహ సహితంగా... అని వింటారు. ఇవి గీతలోని పదాలు, వీటిని చదివి వినిపిస్తారు, అంతేకానీ మీరు ఇలా తయారవ్వండి అని చెప్పరు. కేవలం భగవంతుడు పతితులను పావనులుగా చేయడానికి వచ్చినప్పుడు ఇలా చెప్పి వెళ్ళారు అని అంటారు. కేవలం గీతలో పరమపిత పరమాత్మకు బదులుగా శ్రీకృష్ణుని పేరును వేసేశారు. ఇప్పుడు శ్రీకృష్ణుడైతే రథముపై కూర్చున్నవారు, మరి అతనికి రథము కావాలా? అతను స్వయమే దేహధారి. శ్రీకృష్ణుడి పేరు ఎవరు పెట్టారు? నామకరణము చేసినప్పుడు అందరికీ పేర్లు పెడతారు. తండ్రినైతే కేవలం శివ అనే అంటారు. ఆత్మలైన మీరు జనన-మరణాలలోకి వస్తారు కావున మీ శారీరక పేర్లు మారతాయి.

శివబాబా అయితే జనన-మరణాలలోకి రారు. వారు సదా శివుడే. బిందువు (సున్నా)ను వ్రాసినప్పుడు శివ అని అంటారు. బిందువైన ఆత్మ చాలా సూక్ష్మమైనది. ఒకవేళ ఎవరికైనా ఆత్మ సాక్షాత్కారం జరిగినా అది ఎవరికీ అర్థం కాదు. అదే దేవిని చూస్తే సంతోషిస్తారు. అచ్చా, ఆ తర్వాత ఏమిటి! ప్రాప్తి అయితే ఏమీ లేదు, అర్థమూ లేదు. కేవలం నవ విధ భక్తిని చేస్తారు, దర్శనం పొందుతారు, ఇక అందులోనే సంతోషపడిపోతారు. ఇకపోతే ముక్తి-జీవన్ముక్తి యొక్క విషయమే లేదు. అదంతా భక్తి మార్గము. ఇక్కడ ఇది జ్ఞాన మార్గము. ఇక్కడ చాలా వరకు బ్రహ్మా యొక్క సాక్షాత్కారం జరుగుతుంది, ఆ తర్వాత శ్రీకృష్ణునిది. ఈ బ్రహ్మా వద్దకు వెళ్ళినట్లయితే మీరు కృష్ణపురిలోకి లేక వైకుంఠములోకి వెళ్తారు అని సాక్షాత్కారంలో వారికి చెప్పబడుతుంది. లక్ష్మీ-నారాయణుల సాక్షాత్కారం కూడా జరగవచ్చు. సాక్షాత్కారం జరిగింది అంటే సద్గతి లభించిందని కాదు. ఇది కేవలం ఇక్కడకు వెళ్ళండి అని సూచన లభిస్తుంది. ముందుముందు ఎంతోమందికి సాక్షాత్కారం జరుగుతుంది, డైరెక్షన్ లభిస్తుంది. మీ త్రిమూర్తి చిత్రము కూడా వార్తాపత్రికలలో వస్తుంది, బ్రహ్మాకుమారీల పేరు కూడా వస్తుంది. కావున బ్రహ్మా యొక్క సాక్షాత్కారమే జరుగుతుంది, ఇతని వద్దకు వెళ్ళడం ద్వారా మీకు వైకుంఠ యువరాజుగా అయ్యే జ్ఞానం లభిస్తుంది అని. అర్జునుడికి విష్ణువు మరియు వినాశనం సాక్షాత్కారం జరిగినట్లుగా ఇది జరుగుతుంది.

తండ్రి అంటారు, మీరు కమలపుష్ప సమానముగా అవ్వాలి. కానీ మీరు స్థిరముగా ఉండరు, అందుకే అలంకారాలను విష్ణువుకు ఇచ్చేసారు. లేకపోతే దేవతలకు శంఖము మొదలైనవాటి అవసరముందా! నోటితో వినిపించడాన్ని శంఖధ్వని అని అంటారు. కమలము యొక్క రహస్యాన్ని కూడా తండ్రి అర్థం చేయిస్తారు. బ్రాహ్మణులైన మీరు ఈ సమయంలో కమలపుష్ప సమానముగా అవ్వాలి. గద పంచ వికారాల రూపీ మాయను జయించడానికి సంబంధించినది. తండ్రి ఉపాయాన్ని తెలియజేస్తున్నారు, నన్నొక్కరినే స్మృతి చేసినట్లయితే మీ వికర్మలు వినాశనమవుతాయి. శ్రీమతముపై నడుస్తూ పతిత-పావనుడైన తండ్రిని స్మృతి చేయండి. ఒక్క తండ్రి తప్ప పతిత-పావనులు ఇంకెవరూ లేరు. తండ్రి అంటారు, నన్ను అసలు ఎందుకు పిలుస్తారంటే - మమ్మల్నందరినీ ఈ శరీరము నుండి విడిపించి పావన ప్రపంచములోకి తీసుకువెళ్ళండి అని. కావున తండ్రే వచ్చి ఆత్మలందరినీ పతితుల నుండి పావనులుగా తయారుచేస్తారు ఎందుకంటే అపవిత్ర ఆత్మలైతే ఇంటికి లేక స్వర్గానికి వెళ్ళలేవు. తండ్రి అంటారు, పవిత్రముగా అవ్వాలంటే నన్ను స్మృతి చేయండి. స్మృతి ద్వారానే మీ పాపాలు అంతమవుతూ ఉంటాయి. నేను ఈ గ్యారంటీని ఇస్తాను. ఓ పతిత పావనా రండి, మమ్మల్ని పావనంగా తయారుచేసి కొత్త ప్రపంచములోకి తీసుకువెళ్ళండి అని పిలుస్తారు. మరి ఎలా వెళ్తారు? ఎంత స్పష్టమైన విషయాన్ని చెప్తున్నారు. తండ్రిది సహజమైన జ్ఞానము మరియు సహజమైన విషయము. కార్య-వ్యవహారాలు చేసుకుంటూ నన్ను స్మృతి చేయండి అని అంటారు. ఉద్యోగాలు మొదలైనవి చేసుకుంటున్నా, భోజనం తయారుచేస్తున్నా కూడా స్మృతిలో ఉంటూ చేయండి, అప్పుడు భోజనం కూడా శుద్ధమవుతుంది, అందుకే గాయనము ఉంది, బ్రహ్మా భోజనం తినాలని దేవతలకు కూడా మనసు కలుగుతుంది అని. ఈ కుమార్తెలు కూడా భోగ్ ను తీసుకొని వెళ్ళినప్పుడు అక్కడ సభ జరుగుతుంది. బ్రాహ్మణులు మరియు దేవతల యొక్క మిలనము జరుగుతుంది. వారు భోజనం స్వీకరించేందుకు వస్తారు. బ్రాహ్మణులు భోజనం చేసేటప్పుడు కూడా మంత్రాన్ని జపిస్తారు. బ్రహ్మాభోజనానికి ఎంతో మహిమ ఉంది. సన్యాసులైతే కేవలం బ్రహ్మ తత్వాన్నే తలచుకుంటారు. వారు హద్దులోని సన్యాసులు. మేము ఇళ్ళు-వాకిళ్ళు, ఆస్తిపాస్తులు మొదలైనవాటన్నింటినీ వదిలేసాము అని అంటారు. ఇప్పుడు మళ్ళీ సమాజంలోకి దూరిపోతున్నారు. మీది అనంతమైన సన్యాసము. మీరు ఈ పాత ప్రపంచాన్నే మర్చిపోతారు. మీరు మళ్ళీ కొత్త ప్రపంచములోకి వెళ్ళాలి. ఇంటిలో గృహస్థంలో ఉంటూ - ఇప్పుడు మేము వయా శాంతిధామం సుఖధామంలోకి వెళ్ళాలి అని బుద్ధిలో ఉంది. శాంతిధామాన్ని కూడా స్మృతి చేయవలసి ఉంటుంది. తండ్రిని, శాంతిధామాన్ని మరియు సుఖధామాన్ని స్మృతి చేస్తారు. ఇది మన అనేక జన్మల అంతిమ జన్మ. 84 జన్మలు పూర్తయ్యాయి. సూర్యవంశీయుల నుండి చంద్రవంశీయులుగా, ఆ తర్వాత వైశ్య, శూద్రవంశీయులుగా అయ్యారు... వారైతే ఆత్మయే పరమాత్మ అని, ఆత్మపై కర్మల ప్రభావం ఏమీ ఉండదని, ఎందుకంటే ఆత్మయే పరమాత్మ అని అనేస్తారు. తండ్రి అంటారు, అది కూడా వారు చెప్పే తప్పుడు అర్థము. తండ్రి కూర్చొని హంసో అన్న పదము యొక్క అర్థాన్ని అర్థం చేయిస్తారు. ఆత్మనైన నేను పరమపిత పరమాత్ముని సంతానాన్ని. మొట్టమొదట మనం స్వర్గవాసులైన దేవతలుగా ఉండేవారము, మళ్ళీ చంద్రవంశీయులుగా, క్షత్రియులుగా అయ్యాము, 2500 సంవత్సరాలు పూర్తయ్యాయి, మళ్ళీ వైశ్య, శూద్ర వంశీయులుగా, వికారులుగా అయ్యాము. ఇప్పుడు మనం పిలక స్థానములో ఉండే బ్రాహ్మణులుగా అవుతాము. ఇక్కడ కూర్చున్నాము. ఇది 84 జన్మల పిల్లిమొగ్గల ఆట ఆడినట్లు. ఈ పిల్లిమొగ్గల ఆట యొక్క జ్ఞానం కూడా ఉంది. ఇంతకుముందు తీర్థాలకు వెళ్ళేటప్పుడు కూడా ఇలా పిల్లిమొగ్గలు వేస్తూ గుర్తులు పెడుతూ వెళ్ళేవారు. ఇప్పుడైతే మీ సత్యమైన తీర్థాలు శాంతిధామము, సుఖధామము. మీరు ఆత్మిక పండాలు. మీరు

అందరికీ సలహా ఇస్తారు, తండ్రిని స్మృతి చేసినట్లయితే శాంతిధామములోకి వెళ్ళిపోతారు అని. సాధు-సన్యాసులు మొదలైనవారందరూ శాంతిధామములోకి వెళ్ళేందుకే కృషి చేస్తారు. కానీ ఎవ్వరూ వెళ్ళలేరు. వెళ్ళడమైతే అందరూ కలిసే వెళ్తారు. తండ్రి అర్థం చేయించారు, సత్యయుగములోనైతే చాలా కొద్దిమందే ఉంటారు, తర్వాత వృద్ధి జరుగుతూ ఉంటుంది. మీరే స్వదర్శన చక్రధారులు, దేవతలు కాదు. కానీ ఈ సమయంలో మీకు మాయతో యుద్ధం జరుగుతోంది. ఆ యుద్ధములో కూడా ఎవరినైతే శక్తివంతముగా భావిస్తారో, అతని వద్దకు వెళ్ళి శరణు తీసుకుంటారు. ఇప్పుడు మీరు ఎవరి శరణును తీసుకుంటారు? స్త్రీ-పురుషులిరువురూ - మేము మీ శరణాగతులమవుతాము అని అంటారు. నాకైతే ఒక్క శివబాబా తప్ప ఇంకెవరూ లేరు అని అంటారు. ఆత్మలందరి తండ్రి ఒక్కరే కదా. ఆ ఒక్కరికీ మీరు పిల్లలు. సాధు-సన్యాసులైతే ఒక్కరు కాదు, అనేకమంది భగవంతులైపోతారు. ఎవరైతే ఇంటి నుండి అలిగి వెళ్ళిపోతారో వారు భగవంతుడైపోతారు. అప్పుడు గొప్ప-గొప్ప షావుకార్లు, కోటీశ్వరులు వెళ్ళి వారి శిష్యులుగా అవుతారు మరియు అశుద్ధ ఆహార-పానీయాల సభలను జరుపుతారు. తమోప్రధాన మనుష్యులు కదా. హిందువులకైతే తమ ధర్మము గురించే తెలియదు.

తండ్రి అర్థం చేయిస్తారు, మీరు వాస్తవానికి ఆది సనాతన దేవీ-దేవతా ధర్మానికి చెందినవారే, కానీ పతితులుగా అయిపోయారు కావున స్వయాన్ని దేవతలుగా పిలుచుకోలేరు. ఆ ధర్మమే కనుమరుగైపోయింది. మనుష్యులు ఎంత వికారులుగా, వికారీ దృష్టి కలవారిగా ఉన్నారు. ఒక మినిస్టర్ బాబా వద్దకు వచ్చారు, నా దృష్టి వికారీగా అవుతోంది అని అన్నారు. ఇప్పుడు తండ్రి అర్థం చేయిస్తారు - పిల్లలూ, పవిత్రమైన దృష్టి కలవారిగా అవ్వండి. ఎప్పటివరకైతే వికారీ దృష్టి కలుగుతుందో, అప్పటివరకూ మీరు పతితులు. పరస్పరం సోదరులుగా భావించండి, అప్పుడు ఆ వికారీ దృష్టి దూరమైపోతుంది. ఆత్మలమైన మనం సోదరులము. ఒక్క తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకుంటున్నాము. ఆత్మకు సింహాసనము ఈ భృకుటి, దీనిని అకాల సింహాసనము అంటారు. అకాల ఆత్మ ఈ సింహాసనముపై విరాజమానమై ఉంది. ఇది మట్టి బొమ్మ. మొత్తం పాత్ర అంతా ఆత్మలోనే నిండి ఉంది. తండ్రి అంటారు, నేను పిల్లలైన మీకు వారసత్వాన్ని ఇవ్వడానికి 5000 సంవత్సరాలకు తర్వాత వస్తాను. మనం హెల్త్, వెల్త్, హ్యాపినెస్ (ఆరోగ్యము, సంపద, ఆనందము) యొక్క వారసత్వాన్ని తీసుకునేందుకు వచ్చామని మీకు తెలుసు. సత్యయుగములో అపారమైన ధనం లభిస్తుంది. మీరు 21 తరాలు దేవతలుగా అవుతారు. వృద్ధాప్యం రాకుండా ఎప్పుడూ ఎవరూ మరణించరు. ఇక్కడైతే కూర్చుంటూ-కూర్చుంటూ అకస్మాత్తుగా మరణిస్తారు. గర్భము లోపల కూడా మరణిస్తారు. అక్కడైతే దుఃఖము అన్న మాటే ఉండదు. దానిని సుఖధామము, రామ రాజ్యము అని అంటారు. ఇది దుఃఖధామము, రావణ రాజ్యము. సత్యయుగములో రావణుడే ఉండడు.

ఈ 84 జన్మల చక్రము కూడా బుద్ధిలో మీకు గుర్తుంటుంది. ఎంతో సంతోషము ఉంటుంది. మనం కొత్త విశ్వానికి అనగా సత్యయుగానికి యజమానులుగా అవ్వనున్నాము అని మీకు తెలుసు. గీతలో కూడా భగవానువాచ ఉంది కదా - ఓ పిల్లలూ, దేహ సహితంగా దేహపు సర్వ సంబంధాలనూ వదలండి, స్వయాన్ని ఆత్మగా భావిస్తూ నన్నొక్కరినే స్మృతి చేయండి. మీ సత్యాతి-సత్యమైన ఖుదా దోస్త్ వారే. అల్లా-అవల్దీన్ నాటకము, హాతంతాయి నాటకము ఇవన్నీ ఈ సమయానికి చెందినవే. ఇప్పుడు పిల్లలు తక్కువమంది పుట్టాలి అని మనుష్యులు ఎంతగా తల బాదుకుంటూ ఉంటారు. అనంతమైన తండ్రి జనాభా సంఖ్యను ఎంతగా తగ్గించేస్తారు. సత్యయుగంలో మొత్తం విశ్వమంతటిలో కేవలం 9 లక్షల జనాభాయే మిగులుతుంది. ఇన్ని కోట్లమంది మనుష్యులు అక్కడ ఉండనే ఉండరు. అందరూ ముక్తిధామములోకి, శాంతిధామములోకి వెళ్ళిపోతారు. ఇదే అద్భుతమైన విషయము కదా. ఒక్క దేవీ-దేవతా ధర్మము యొక్క పునాదిని వేసి మిగిలినవాటన్నింటినీ వినాశనం చేసేస్తారు. ఈ 84 జన్మల చక్రాన్ని మంచి రీతిలో బుద్ధిలో కూర్చోబెట్టుకోవాలి. ఇది స్వదర్శన చక్రము. అంతేకానీ ఆ చక్రముతో ఎవరి శిరస్సును ఖండించేది లేదు. శాస్త్రాలలో శ్రీకృష్ణుని గురించి హింసాయుతమైన విషయాలను వ్రాసేసారు. అందరినీ స్వదర్శన చక్రముతో హతమార్చారు అని వ్రాసారు. ఇది కూడా గ్లానియే కదా. ఎంత హింసాయుతులుగా చేసేసారు. మీరు డబుల్ అహింసకులుగా అవుతారు. కామ ఖడ్గాన్ని ఉపయోగించడము, ఇది కూడా హింసయే. దేవతలను పవిత్రులు అని అంటారు. యోగబలముతో విశ్వాధిపతులుగా అవ్వగలిగినప్పుడు మరి యోగబలముతో పిల్లలు ఎందుకు జన్మించలేరు. ఇప్పుడు కొడుకు పుట్టబోతున్నాడు అని సాక్షాత్కారమవుతుంది. బాబా అయితే - ఇప్పుడు ఇక ఈ పాత శరీరాన్ని వదులుతాను మరియు నోట్లో బంగారు చెంచా ఉంటుందని భావిస్తారు. మేము అమరలోకములో జన్మ తీసుకుంటే నోట్లో బంగారు చెంచా ఉంటుందని మీరు కూడా భావిస్తారు. పేద ప్రజలు కూడా కావాలి కదా. అక్కడ దుఃఖము యొక్క విషయమేదీ ఉండనే ఉండదు. ప్రజల వద్ద అంతటి ధనము-సంపద ఏమీ ఉండదు, అయితే, వారికి

సుఖము ఉంటుంది, ఆయుష్షు ఎక్కువ ఉంటుంది. రాజు, రాణి, షావుకారు ప్రజలు అందరూ కావాలి కదా. అచ్చా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తండ్రి స్మృతితోపాటుగా సంతోషములో ఉండేందుకు 84 జన్మల చక్రాన్ని కూడా స్మృతి చేయాలి. స్వదర్శన చక్రాన్ని తిప్పాలి. ఖుదాను మీ సత్యమైన స్నేహితునిగా చేసుకోవాలి.

2. డబుల్ అహింసకులుగా అయ్యేందుకు వికారీ దృష్టిని తొలగించుకొని పవిత్రమైన దృష్టిని తయారుచేసుకోవాలి. ఆత్మలమైన మనం సోదరులము, ఈ అభ్యాసము చేయాలి.

వరదానము:- సర్వశక్తివంతుడైన తండ్రిని కంబైండు రూపములో తోడుగా ఉంచుకొనే సఫలతామూర్త భవ

ఏ పిల్లలతోనైతే సర్వశక్తివంతుడైన తండ్రి కంబైండుగా ఉన్నారో, వారికి సర్వ శక్తులపై అధికారము ఉంది మరియు ఎక్కడైతే సర్వ శక్తులు ఉన్నాయో అక్కడ సఫలత లేకుండా ఉండటమనేది అసంభవము. ఒకవేళ సదా తండ్రితో కంబైండుగా ఉండటములో లోటు ఉన్నట్లయితే సఫలత కూడా తక్కువగా ఉంటుంది. సదా తోడును నిర్వర్తించే అవినాశీ సహచరుడిని కంబైండుగా ఉంచుకున్నట్లయితే సఫలత జన్మసిద్ధ అధికారమవుతుంది ఎందుకంటే సఫలత మాస్టర్ సర్వశక్తివంతుల ముందు వెనుక తిరుగుతుంటుంది.

స్లోగన్:- సత్యమైన వైష్ణవులు ఎవరంటే, ఎవరైతే వికారాలనే మురికిని తాకను కూడా తాకరో వారు.